రైతు భరోసా నిధులివ్వాలి

రైతు భరోసా ఎత్తివేత ప్రకటనను నిరసిస్తూ రైతులు, బీఆర్ఎస్ నేతల రాస్తారోకో, ధర్నాలు పలుచోట్ల ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం

కొత్తూరు : ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా ఎకరాకు రూ. 15వేల రైతుభరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ, దేవేందర్‌యాదవ్ డిమాండ్ చేశారు. రైతు భరోసా పథకం ఎత్తివేతను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు దేవేందర్‌యాదవ్, ఎమ్మె సత్యనారాయణ ఆధ్వర్యంలో కొత్తూరు పాత జాతీయ రహదారిపై ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబద్ధాల హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ. 15 వేలు ఇస్తామని రైతులను మోసం చేశారని చెప్పారు. మంత్రి తుమ్మల రైతు భరోసాను ఎత్తివేస్తామని చెప్పడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వానకాలానికి సంబంధించిన ఎకరాకు రూ.15 వేల చొప్పున వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల కోసం శాంతియుతంగా నిరసర తెలుపుతుంటే నిర్బంధించడం ఏంటని వారు ప్రశ్నించారు. నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నరసింహారెడ్డి, కౌన్సిలర్లు నర్సింహాగౌడ్, సోమ్లానాయక్, మాజీ సర్పంచ్ సత్తయ్య, నాయకులు దేశాల జైపాల్, ముధుసూదన్ రావు, దామోదర్‌రెడ్డి, శ్రీశైలం, బి.రాజు, రవినాయక్, గోపాల్ గౌడ్, భీమయ్య, ఎమ్మె అజయ్, జంగయ్యయాదవ్, కృష్ణయ్య, సురేశ్, రాఘవేందర్ పాల్గొన్నారు.

ఆమనగల్లు పట్టణంలో సీఎం దిష్టిబొమ్మ దహనం

ఆమనగల్లు : ఆమనగల్లు పట్టణంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆదేశానుసారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ రహదారిపై భారీ నిరసన కార్యక్రమం చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. తదనంతరం రైతులు, బీఆర్ఎస్ నాయకులు ర్యాలీగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, మాజీ జడ్పీటీసీ నేనావత్ అనురాధ, మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బాలస్వామి, సాయిలు, భీమయ్య, ప్రసాద్, రమేశ్, వెంకటేశ్, గణేశ్, రమేశ్ నాయక్, సైదుల్‌గౌడ్, శివకుమార్, రేపని విజయ్, ఆనంద్, దేవేందర్, శ్రీరామ్ పాల్గొన్నారు.

కొత్తూరు : నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్ల టౌన్: ధర్నాలో పాల్గొన్న డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ఆంజనేయులు, నాయకులు



చేవెళ్ల రూరల్ : శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్ల పట్టణ కేంద్రంలో..

చేవెళ్లటౌన్ : చేవెళ్ల పట్టణ కేంద్రంలోని హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులను చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తన సిబ్బందితో వచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి ఆంజనేయులు, మాజీ సర్పంచ్‌లు నరహరిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు గౌడ్, భాను, మాజీ యూత్ మండల అధ్యక్షుడు శేఖర్, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అబ్దుల్‌గని, నాయకులు చందు, నాగుల్‌రెడ్డి, శేరిరాజు, మహేందర్, శేఖర్, మాధవరెడ్డి, మాణిక్యరెడ్డి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో ధర్నా

చేవెళ్ల రూరల్ : శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని ఇంద్రారెడ్డి విగ్రహం వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రైతు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తూ రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు లక్ష్మీనర్సింహారెడ్డి, శశిధర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, భవాని యాదగిరి, ఇంద్ర సేనారెడ్డి, శ్రీనివాస్, మానయ్య, మహ్మద్ ఎజాస్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆమనగల్లులో జాతీయ రహదారిపై ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

హామీలను తుంగలో తొక్కారు

మొయినాబాద్ : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పూర్తిగా తుంగలో తొక్కిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, పార్టీ నాయకుడు కొత్త నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మొయినాబాద్ మండల కేంద్రంలోని హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై అన్నదాతలకు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు శ్రీమరియాదవ్, సుధాకర్‌యాదవ్, దారెడ్డి వెంకట్‌రెడ్డి, గణేశ్‌రెడ్డి, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, మహేందర్‌రెడ్డి, అంజయ్యగౌడ్, పరమేశ్, అరవింద్, లక్ష్మీనారాయణ, సుభాశ్, నర్సింహారెడ్డి, రమేశ్, కిరణ్, సునీల్, బాలమల్లేశ్, దర్శన్, అలీమ్, అసీఫ్, పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా ఎత్తివేస్తామన్న ప్రకటనను నిరసిస్తూ ఆదివారం మండల కేంద్రంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి సీఎం, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు వీరయ్య, సేవ్యానాయక్, వెంకటేశ్‌యాదవ్, మాజీ సర్పంచ్‌లు హరిచంద్‌నాయక్, తులసీరాంనాయక్, కృష్ణయ్యయాదవ్, భారతమ్మనర్సింహాగౌడ్, మాజీ ఎంపీటీసీ మంజులచంద్రమౌళి, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు సీహెచ్ మహేశ్, హెచ్ఆర్ మహేశ్, ఇర్షాద్, పాండు, శ్రీను, బాబా, కృష్ణ, అంజి, సాబేర్, వెంకటేశ్, జగన్‌యాదవ్, యాదయ్య, శ్రీకాంత్, ప్రశాంత్, శ్రీశైలం, భాస్కర్, సుమన్, సాయి, రాజు, చందర్, భీమన్, వెంకటయ్య, లక్ష్మయ్య, గోపాల్, భిక్షపతి, దేవూలా, చంద్రయ్య, మల్లేశ్, సక్రు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో హైదరాబాద్ -బీజాపూర్ జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

కడ్తాల్: ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, చిత్రంలో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్

సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

ప్రజా సంక్షేమాన్ని విస్మరించాయి..

యాచారం, అక్టోబర్20: ప్రజా సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మధుసూధన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని మంథన్‌గౌరెల్లి గ్రామంలో సీపీఎం గ్రామశాఖ సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజాసంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. మహిళలకు నెలకు రూ.2500లు వెంటనే అమలు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులను మంజూరు చేయాలని కోరారు. రైతులకు రైతుభరోసా డబ్బులను ఖాతాల్లో జమచేయాలన్నారు. వృద్ధులకు రూ.4016, దివ్యాంగులకు రూ.6016 పింఛన్లు అందించాలన్నారు. ఫార్మాసిటీని మండలంలో ఏర్పాటు చేయొద్దని ఆయన డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వ హయాంలో దళితుల మీద దాడులు, అరాచకాలు పెరిగిపోతున్నాయన్నారు. పేదల సంక్షేమాన్ని విస్మరించి అదానీ, అంబానీ లాంటి పెద్దలకు కొమ్ము కాస్తుందన్నారు. అనంతరం మాల్ గ్రామశాఖ కార్యదరిగా కందుల శ్రీరాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు చందూనాయక్, తావునాయక్, పంతు, మోతీలాల్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

పార్టీ జెండాను ఆవిష్కరించిన నాయకులు

తుర్కయాంజాల్, అక్టోబర్ 20 : ప్రజా సమస్యలే ధ్యేయంగా కమ్యూనిస్టులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పగడాల యాదయ్య అన్నారు. సీపీఎం తుర్కయాంజాల్ సెంటర్ శాఖ ప్రథమ మహాసభను తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు జెండాను ఆవిష్కరించి సభను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యాదయ్య మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం పోరాతుందని తెలిపారు. ప్రభుత్వ భూములను రాజకీయ నాయకులు, అధికారులు ఒక్కటై కొల్లగొడుతున్నారని, దీనికి వ్యతిరేకంగా పోరాటం సాగిస్తామని తెలిపారు. పేదలందరికీ ప్రభుత్వం ఇంటి స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం తుర్కయాంజాల్ సెంటర్ శాఖ కార్యదర్శిగా అరుణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కిషన్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 20 : శంకర్‌పల్లి మండల పరిధి కొండకల్ గ్రామ తండాకు చెందిన గిరిజనుల భూములను విక్రంరెడ్డి అనే భూస్వామితో కలిసి ఓ కన్‌స్ట్రక్షన్ యాజమాన్యం ఆక్రమించిందని, ఈ విషయమై రెవెన్యూ, పోలీసులకు విన్నవించినా పరిష్కారం కావడంలేదని కొండకల్ గ్రామ తండాకు చెందిన గిరిజనులు ఆదివారం భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంశివరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజనుల భూములను అన్యాయంగా ఆక్రమించిన వారిపైన చర్యలు తీసుకొని, మాకు న్యాయం చేయాలని కోరారు. సాంశివరావును కలిసిన వారిలో చందర్, బాబు, లక్ష్మణ్, శంకర్, రాజు తదితరులు ఉన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ అండ

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్ (తలకొండపల్లి), అక్టోబర్ 20: ఆపదలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ ఎంపీపీ తిరుమణి నిర్మలాశ్రీశైలంగౌడ్ అన్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పసుల శివ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఆదివారం బీఆర్ఎస్ నాయకులు గ్రామంలోని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ తరపున రూ.84వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. అదే విధంగా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తరపున చైర్మన్ వెంకటేశ్ అందించిన రూ.1,00,116 చెక్కును నాయకులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు అంజిరెడ్డి, అజయ్‌గౌడ్, తిరుపతి, శేఖర్, వెంకట్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, తిరుపతయ్య, యాదయ్య, వెంకటేశ్, నారాయణ, ఆంజనేయులు, శంకర్, మహేశ్, ధర్మారెడ్డి, కుమారస్వామి, వీరేశ్, కృష్ణయ్య, జోగయ్య, రఘురాములు, అంజిరెడ్డి, శ్రీశైలం, రమేశ్, మల్లేశ్, జగన్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల పాదయాత్ర

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో అయ్యప్పమాల ధరించి 41రోజుల పాటు దీక్ష అనంతరం ఆదివారం కాలినడకన ఇబ్రహీంపట్నం నుంచి అజయ్‌గురుస్వామి ఆధ్వర్యంలో శబరిమలైకు బయలుదేరి వెళ్లారు. వీరిలో శ్రీనివాస్, శివసాగర్, యాదగిరి స్వాములు ఉన్నారు.

- ఇబ్రహీంపట్నంరూరల్

కుక్క కాటుతో మహిళ మృతి

షాబాద్, అక్టోబర్ 20: కుక్కకాటుతో ఓ మహిళ మృతిచెందిన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ కాంతారెడ్డి కథనం ప్రకారం.. షాబాద్ గ్రామానికి చెందిన చిల్కమర్రి లచ్చమ్మ(55) ఈ నెల 16వ తేదీన ఇంటి బయట కూర్చుని ఉండగా వీధి కుక్క కాటు వేయడంతో గమనించిన కుటుంబీకులు వెంటనే చికిత్స కోసం చేవెళ్లలోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఉస్మానియా దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం లచ్చమ్మ మృతిచెందింది. కుక్క కాటు వేయడం వల్లే ఇన్ఫెక్షన్ అయి మహిళ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'అపూర్వ' సమ్మేళనం

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 20 : 1998–99 సంవత్సరంలో చేవెళ్ల మండల పరిధి చన్‌వెల్లి జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం మండల పరిధి ఇబ్రహీంపల్లి గ్రామ రెవెన్యూలోని జీపీఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారికి పాఠాలు చెప్పిన గురువులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విజకుమార్, బుచ్చిరెడ్డి, నాగరాజ్, మనోహర్‌రెడ్డి, జనార్దనాచారి, రాములు, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు వసంతం పాల్గొన్నారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 20 : స్థానిక సంస్థల ఎన్నికల ముందే పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ (టీపీఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఇ.శ్రీనివాస్ అన్నారు. రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పంచాయతీలను గ్రేడ్ –1,2, 3, 4 కింద పున:వ్యవస్థీకరణ చేయాలన్నారు. ఉద్యోగుల క్యాడర్ కేటాయింపు నియామకపు తేదీ నుంచి సర్వీస్‌ను లెక్కిస్తూ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ కాలాన్ని నాలుగు నుంచి రెండు సంవత్సరాలకు తగ్గించి ప్రమోషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఔట్ సోర్సింగ్ ద్వారా పంచాయతీ కార్యదర్శుల నియామకాలను రద్దు చేస్తూ ప్రస్తుతం పని చేస్తున్న ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా మార్చి వారి సర్వీస్ కాలాన్ని జేపీఎస్ సర్వీస్‌గా పరిగణించాలన్నారు. జీవో ఎంఎస్ 317 ద్వారా నష్టపోయిన వారిని తిరిగి వారి సొంత జిల్లా/జోన్‌లకు పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎంఎస్ఎస్ వాణి, ప్రచార కార్యదర్శి నరేశ్, కార్యనిర్వాహక కార్యదర్శి బి.సురేశ్‌గౌడ్, సహాయ కార్యదర్శులు ఎన్ వెంకటనారాయణ, టి.ప్రవీణ్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

బాధిత కుటుంబాలకు పరామర్శ

కులకచర్ల, అక్టోబర్ 20 : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తిర్మలాపూర్ గ్రామానికి చెందిన పోగుల రాములుగౌడ్ కుటుంబసభ్యులను పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పరామర్శించారు. సీనియర్ జర్నలిస్టుగా సేవలు నిర్వహించిన రాములుగౌడ్ మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రాజు, బీఆర్ఎస్ తిర్మలాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మహేశ్వరం రాములుగౌడ్, మాజీ ఎంపీటీసీ అంజిలయ్యగౌడ్, సత్యనారాయణగౌడ్, నర్సింహులు, వెంకటయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కులకచర్ల: మండల పరిధిలోని సాల్వీడ్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు హన్మంతు మాతృమూర్తి అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కొండయ్య, బీఆర్ఎస్ నేత రాజు, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నీటిని సంరక్షించాలి

గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ముఖ్యప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న చైర్మన్ రాజేందర్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 20: కోటి సభ్యత్వాలతో గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం కోసం కృషి చేద్దామని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు గాంధీయన్ కాలేజీలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ముఖ్య ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. గాంధీజీ సూచించిన ఏకాదశ సూత్రాలు, సామాజిక మహాపాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో కూడిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వైద్యం, సుస్థిర ఇంధన వనరులు తదితరాల కోసం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ తరపున రాష్ట్రంలోని 12 వేల మంది ప్రతినిధులు స్వచ్ఛందంగా పనిచేస్తున్నారన్నారు. నీటి సంరక్షణ కోసం ప్రతి సభ్యుడు పనిచేయాలని కోరారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న ఉత్తమ రైతు దంపతులకు, వ్యవసాయ అనుబంధ రంగాలకు కృషి చేస్తున్న శాస్త్రవేత్తలు, వైద్యులు, జర్నలిస్టులు, అధికారులకు పుడమిపుత్ర, కిసాన్ సేవా రత్న అవార్డులు అందజేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. సమావేశంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, గిరిధర్‌గౌడ్, గోనా రెడ్డి, మంజుల, కే బీవీ కృష్ణారావు, పీ పావని, మధు, నాగమణి, సునీత భూమన్న, రమణారెడ్డి, సత్యనారాయణ, సురేందర్, మల్లికార్జున్, సంధ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమాజ ఐక్యతకు కృషి

పథ సంచలన్ కార్యక్రమం నిర్వహిస్తున్న స్వయం సేవకులు

చేవెళ్లటౌన్, అక్టోబర్ 20: సమాజ ఐక్యత, సామాజిక సేవ కోసమే ఆర్ఎస్ఎస్ హిందువులందరినీ సంఘటితం చేస్తుందని తెలంగాణ ప్రాంత ఉద్యోగి శాఖ ప్రముఖ్ ప్రసాద్ తెలిపారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఏర్పాటై శతాబ్దంలోకి అడుగుపెట్టిన సందర్భంగా సంఘం కార్యకర్తలు ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలో శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల గ్రామ రచ్చబండ నుంచి పురవీధుల గుండా స్వయం సేవకులు పథ సంచలన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాలమూరు విభాగ్ సహకార్యవాహ అనంతరెడ్డి, ఖండా కార్యవాహ కృష్ణారెడ్డి, ముఖ్యవక్తగా తెలంగాణ ప్రాంత ఉద్యోగి శాఖల ప్రముఖ్ రాంప్రసాద్ హాజరయ్యారు. కార్యక్రమంలో స్వయం సేవలు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

షాబాద్, అక్టోబర్ 20: ఓ యువతి అదృశ్యమైన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని అంతారం గ్రామానికి చెందిన సౌమ్య(20) ఈ నెల 19వతేదీన ఇంటిలో నుంచి బయటకి వెళ్లిపోయిన్నట్లు తెలిపారు. ఆమె కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువతి మామ మహేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

మాడ్గుల, అక్టోబర్ 20 : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మండలంలోని అప్పారెడ్డి గ్రామానికి చెందిన జిల్లా కమిటీ సభ్యురాలు గోకమల్ల సైదమ్మ మండల ప్రజలను ఒక ప్రకటనలో కోరారు. కొత్తగూడెంలో 21, 22, 23 తేదీల్లో సభలు జరుగుతాయన్నారు. దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. మహిళలపై రోజురోజుకూ హత్యలు, లైంగికదాడులు పెరిగిపోతున్నాయని మండిపడ్డారు.

కరపత్రాలు విడుదల

ఆమనగల్లు, అక్టోబర్ 20: నవంబర్ 3న జరగబోయే ధర్మ సమాజ్ పార్టీ మొదటి సమ్మేళన కరపత్రాలను ఆదివారం మండల పరిషత్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట స్థానిక నాయకులతో కలిసి ధర్మస మాజ్ పార్టీ జిల్లా కో–కన్వీనర్ వంకేశ్వరం రమేశ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగుబలహీన వర్గాలకు రాజ్యాధికారమే ధ్యేయంగా ధర్మ సమాజ్‌పార్టీ పనిచేస్తుందని ఆయన అన్నారు. కార్యాక్రమంలో మండల అధ్యక్షుడు బలరాం, నాయకులు ప్రవీణ్, యాదగిరి, సురేశ్, వంశీ, మహేశ్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

పరిగి, అక్టోబర్ 20 : కన్న తల్లి ఎదుటే విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన పరిగి మండలం రంగంపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన పార్వతమ్మ, ఆమె ఇరువురు కుమారులు బాల్‌రాజ్(35), రాములు శనివారం రాత్రి 8.30 గంటలకు పొలం పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వెళ్తుండగా నారాయణ రెడ్డి పొలం వద్ద విద్యుత్ వైరుకు తాకిన బాల్‌రాజ్ కిందపడిపోయాడు. దీంతో బాల్‌రాజ్‌కు విద్యుత్‌షాక్ కొట్టినట్లుగా రాములు గమనించాడు. కళ్లముందే తన కొడుకు చనిపోవడంతో తల్లి పార్వతమ్మ బోరున విలపించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోశ్‌కుమార్ తెలిపారు.